# బీఆర్ఎస్‌తోనే సబ్బండ వర్గాల సంక్షేమం



సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ నేతలను కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నేత చీటి నర్సింగరావు



సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ సీనియర్ నేత బొల్లి రామ్మోహన్‌కు ఏకగ్రీవ తీర్మాన కాపీని అందజేస్తున్న సెల్ పాయింట్ అసోసియేషన్ సభ్యులు

- బీఆర్ఎస్ రాష్ట్ర నేత చీటి నర్సింగరావు
- బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలు

సిరిసిల్ల టౌన్, నవంబర్ 26: స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్బండ వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నదని బీఆర్ఎస్ రాష్ట్ర నేత చీటి నర్సింగరావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఫిరోజ్‌బాద్ షాతో పాటు వందమందికి పైగా యువకులు బీఆర్ఎస్‌లో చేరగా చీటి నర్సింగరావు వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ నాయకత్వంలో జిల్లాలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్‌లోకి వస్తున్నారన్నారు. అనంతరం బీఆర్ఎస్ యూత్ నాయకుడు మహమూద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన షబ్బీర్‌తో పాటు 30మంది యువకులు పార్టీలో చేరగా బీఆర్ఎస్ రాష్ట్ర నేత చీటి నర్సింగరావు వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఇక్కడ టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఆర్ఎస్‌వై నేతలు మహమూద్, సామల శ్రీనివాస్ ఉన్నారు.

### సెల్ పాయింట్ అసోసియేషన్ తీర్మానం

సిరిసిల్ల సెల్ పాయింట్ అసోసియేషన్ సభ్యులు తమ సంపూర్ణ మద్దతు మంత్రి కేటీఆర్‌కేనని ప్రకటించారు. ఈ మేరకు తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, సెల్ పాయింట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బొల్లి రామ్మోహన్‌కు ఏకగ్రీవం తీర్మానం చేసిన కాపిని అందజేశారు. సెల్ పాయింట్ అసోసియేషన్ అధ్యక్షుడు మెహరానంద్, ఉపాధ్యక్షుడు సయ్యద్ ఇమ్రాన్, కార్యదర్శి రాపెల్లి రవి, సలహాదారుడు తడుక విజయ్‌కుమార్, కోశాధికారి రాజు పాల్గొన్నారు.

## కేటీఆర్ సభకు తరలిన నాయకులు

గంగాధర, నవంబర్ 26: ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ చొప్పదండిలో ఏర్పాటు చేసిన రోడ్‌షోకు గంగాధర మండలంలోని వివిధ గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా తరలివెళ్లారు. ఎంపీపీ శ్రీరాం మధుకర్, గంగాధర, కురిక్యాల సింగిల్ విండో చైర్మన్లు దూలం బాలాగౌడ్, వెలిచాల తిర్మల్ రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్ రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్ రావు, వైస్ ఎంపీపీ కంకణాల రాజ్‌గోపాల్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు మడ్లపెల్లి గంగాధర్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు అట్ల రాజిరెడ్డి, ఉపసర్పంచులు ఫోరం మండలాధ్యక్షుడు నిమ్మనవేణి ప్రభాకర్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఉసర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సైనికుల్లా పని చేయాలి

కలెక్టరేట్, నవంబర్ 26: ఈ ఎన్నికల్లో గంగుల కమలాకర్ గెలుపు కోసం ఎంఐఎం శ్రేణులు సైనికుల్లా పని చేయాలని పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ పిలుపునిచ్చారు. నగరంలోని తన నివాసంలో ఆదివారం పార్టీ నగర శాఖ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, డివిజన్ అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ రోజున ఓటింగ్ శాతం పెరిగేలా ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై కృషి చేయాలని కోరారు. బారీస్టర్ అసదుద్దీన్ ఓవైసీ పిలుపు మేరకు పార్టీ శ్రేణులు కారు గుర్తుపై ఓటేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఐఎం నగర కార్యదర్శి బర్కత్ అలీ, మొయిజొద్దీన్ ఖాద్రీ యూసుఫ్, అతీనా, ఖమ్రొద్దీన్, ఖాజా, ఇబ్రహీం, 35 డివిజన్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 2న సామూహిక వ్రతాలు

కరీంనగర్ రూరల్, నవంబర్ 26: కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకొని డిసెంబర్ 2న సామూహిక సత్యనారాయణ వ్రతాలు, 3న సాయంత్రం లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మాధికారి వేదపండితుడు పురాణం మహేశ్వర శర్మ తెలిపారు. డిసెంబర్ 3న సాయంత్రం కార్తీక మాస ప్రయోక్త చతుషష్టి పూజలు, దీప సంకల్పం, దీపారాధన, మహా మంగళహారతి, అనంతరం దీపోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబర్ 83672 34123లో సంప్రదించాలని కోరారు.

# హోమ్ ఓటింగ్‌కు అనూహ్య స్పందన



హోమ్ ఓటింగ్‌లో పాల్గొన్న సిబ్బంది

- హోమ్ ఓటింగ్‌పై కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రత్యేక దృష్టి
- రెండు నియోజకవర్గాల్లో 944 మంది (92 శాతం) ఓటింగ్ వినియోగం
- జిల్లాలో 6 రోజులపాటు కొనసాగిన హోమ్ ఓటింగ్



ఓటు హక్కు వినియోగించుకుంటున్న దివ్యాంగుడు



ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధుడు

కలెక్టరేట్, నవంబర్ 26: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మంగళవారం నుంచి శనివారం వరకు ఆరు రోజులపాటు అధికారులు హోమ్ ఓటింగ్‌కు అవకాశం కల్పించారు. 80 ఏళ్లకు పైబడిన వృద్ధులు, 40 శాతం పైబడి వైకల్యం కలిగిన దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటు వేసే సదుపాయాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. జిల్లాలో హోమ్ ఓటింగ్‌పై కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రత్యేక దృష్టి పెట్టారు. జిల్లా పరిధిలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల పరిధిలో హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న మొత్తం 1028 మందికి 944 మంది (92 శాతం) ఇంటి వద్ద నుంచి ఓటు సద్వినియోగం చేసుకున్నారు. హోమ్ ఓటింగ్ కోసం సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గంలో 5, వేములవాడ నియోజకవర్గంలో 9 బృందాలను ఏర్పాటు చేయగా కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు వారు ఇంటింటికీ వెళ్లి హోమ్ ఓటింగ్ నిర్వహించారు. ఇంటి వద్ద సాధారణ పోలింగ్ కేంద్రం మాదిరి ఏర్పాటు చేసి హోమ్ ఓటింగ్‌కు అవకాశం కల్పించారు. ఇంటి వద్దకే వచ్చి ఓటు హక్కు కల్పించడం పట్ల వయోవృద్ధులు, దివ్యాంగులు సంతోషం వ్యక్తం చేశారు.

## 29 లోగా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

కలెక్టరేట్, నవంబర్ 26: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల విధుల్లో ఉండి ఇది వరకే ఫారం–12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న సిబ్బందికి ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్‌జయంతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో ఉండి ఇప్పటి వరకు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోని సిబ్బంది ఈ నెల 29 వరకు సిరిసిల్ల, వేములవాడ తహసీల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెలిసిటేషన్ సెంటర్‌లో కార్యాలయాల పని వేళల్లో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని కోరారు.

## ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ పూర్తి

కలెక్టరేట్, నవంబర్ 26: జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో వంద శాతం ఓటరు సమాచార స్లిప్‌లను పంపిణీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఓటరు సమాచార స్లిప్పులను బూత్ లెవెల్ అధికారుల ద్వారా పంపిణీ చేశారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల పరిధిలోని మొత్తం 547 పోలింగ్ కేంద్రాల పరిధిలోని 4,66,677 మంది ఓటర్లకు ఇంటింటికీ ఓటరు సమాచార స్లిప్పులు పంపిణీ చేశారు.

## బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



అనంతారంలో ప్రచారం చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ, నాయకులు

ఇల్లంతకుంట, నవంబర్ 26 : మండల కేంద్రంతోపాటు అనంతారం, పెద్దలింగాపూర్, వెంకట్రావుపల్లిలో బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మానకొండూర్ ఎమ్మెల్యేగా డాక్టర్ రసమయి బాలకిషన్‌ను కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఇక్కడ ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, సర్పంచులు కూనబోయిన భాగ్యలక్ష్మి, చల్ల నారాయణ, గొడిసెల జితేందర్‌గౌడ్, ఎంపీటీసీలు ఒగ్గు నర్సయ్య, తీగల పుష్పలత తదితరులు ఉన్నారు.

## రాజ్యాంగం గొప్పతనాన్ని తెలుసుకోవాలి

కలెక్టరేట్, నవంబర్ 26: భారత రాజ్యాంగ గొప్పతనాన్ని, ప్రాథమిక సూత్రాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అన్నారు. ఆదివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం భారత రాజ్యాంగ ప్రవేశిక పత్రాన్ని చదివి జిల్లా అధికారులు, కలెక్టరేట్, ప్రభుత్వ శాఖల ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, డీపీఆర్‌వో మామిండ్ల దశరథం, కలెక్టరేట్ ఏవో రామ్‌రెడ్డి, పర్యవేక్షకుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ముకరంపుర, నవంబర్ 26: ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ విద్యుత్ ఉద్యోగులతో పీఠికను చదివించారు. కార్యక్రమంలో డీఈలు రాజం, గోపీకృష్ణ, ఏడీఈలు నరేందర్, సుధీర్ కుమార్, రాజలింగు, ఎస్ఏవో రాజేశం, ఏవోలు అరవింద్, రాజేంద్రప్రసాద్, మునీందర్, శ్రీనివాసు, శ్రీహరి, కాళిదాసు, కుసుమ శ్రీనివాస్, జీవీ రావు, కే శ్రీనివాస్, మల్లయ్య, సృజన , రమ్యకృష్ణ, శ్రీలత, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రోన్, స్కై బెలూన్ వినియోగంపై నిషేధాజ్ఞలు

- కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి

రాంనగర్, నవంబర్ 26: కరీంనగర్‌కు సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ వస్తున్న నేపథ్యంలో భద్రత కారణాల దృష్ట్యా పారాగ్లైడర్స్, రిమోట్ కంట్రోల్ డ్రోన్స్, రిమోట్ కంట్రోల్ మైక్రోలైట్ ఏయిర్ క్రాఫ్ట్‌లు స్థానిక ఎస్ఆర్ఆర్ డిగ్రీ కాలేజ్ గ్రౌండ్ నుంచి 12 కిలోమీటర్ల పరిధి వరకు, స్కై ఎయిర్ బెలూన్లు కిలోమీటర్ పరిధి వరకు వినియోగాన్ని నిషేధించినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు సోమవారం ఉదయం 6 గంటల నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. పైన పేర్కొన్న సాంకేతిక పరికరాలను ఈ మధ్యకాలంలో వివాహాది శుభకార్యాలు, వివిధ కార్యక్రమాల సందర్భంగా వినియోగిస్తారని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.